

<u>కథ 1997</u>

7

# దావత్

మహమ్మద్ ఖదీర్‌బాబు

"అనో... అస్లామనా... రొంత యిటొచ్చి పోవా"... పెరెట్లోని పలావు దేక్షాకాడికి ఖాళీ డీసు పట్టుకొని అడావిడిగా పోతున్న అస్లాంని పిలిచింది ఆబిదా. తలతిప్పి చూసి, మళ్లొస్తాననన్నట్టు చెయ్యూపి పోబోయాడు అస్లాం.

"యేందిమే. తొరగా జెప్పు. అవుతల ఆకులు పరిచేశారు," అని, రొప్పుకుంటూ వచ్చి ఆగాడతడు.

అస్లాం వెడల్పు మనిషి. పొట్టిగా దిమ్మిసు చేసి నట్టుగా వుంటాడు. కడవంత పొట్ట. చొక్కా నడిమి గుండీ వూడిపోవడంతో చెమట కారుతున్న బొడ్డు అవుపడుతోంది. కళ్లకు రాసుకున్న నాసిరకం సుర్మా కరిగి కళ్ల కింది సంచుల్ని నల్లంగా చేసింది. యెండలు అతడి మొరటు వొంటికి అలివి గావడం లేదు.

"ఆడోళ్లని యెప్పుడు కూసోబెడతారనా... పిల్లోడు ఆకలితో అల్లాడిపోతున్నాడు," అంది ఆబిదా- వేలు పట్టుకొని నిలుచున్న కొడుకుని చూపిస్తూ.

అస్లాం ఆమె వొంక ఎగాదిగా చూశాడు.

"యేందిమే... నకరాలు పడుతుండావు. యిప్పుడే మొగ పెళ్లోళ్లు తొలి బంతి కూసున్నారు. వాళ్ల మొగోళ్లే యింకో రెండు బంతిలకు పట్టేంత మందున్నారు. వాళ్లయ్యాక వాళ్ల ఆడోళ్లా. ఆ తర్వాత మన మొగోళ్లా. అంతా అయ్యాకే మీరు. నీ కొడిక్కి ఆకలిగా వుంటే ఆకెత్తుకొని దేక్షాకాడికి రా. పెట్టిస్తా. ఆణ్ణే తినిపించెయ్," అని పడుతూ లేస్తూ వెళ్లిపోయాడు.

ఆబిదాకు నామోషిగా అనిపించింది... యిస్తరా కెత్తుకొని దేక్షాకాడికి వెళ్లాలంటే. పిల్లాడేమో 'ఆకలి మా' అంటున్నాడు తడవకోసారి. ఒక్కక్షణం మనసు లాగింది వెళదామా అని. కాని తమాయించుకొని మండువ కింద ఆడ పెళ్లోళ్ల కాడికెళ్లి కూర్చుంది. అక్కడ ఆడోళ్లందరూ గుంపుగా కుర్చీల్లో కూర్చొని వున్నారు. చమ్కీ రైకలు, యెరపూ పాచిరంగు చీరలతో మండువా తళతళలాడి పోతోంది. వయసొచ్చిన అమ్మాయిలు కాస్త యెడంగా కూర్చొని యికయికలు పోతున్నారు.

చుట్టూ అత్తరుతో కలిసిన చెమటోసన.

"యింకెంతసేపంట తల్లా," అంది వొక వయసు మళ్లినావిడ ఆబిదాతో.

ఆకలి వల్లో, యెండ వల్లో ఆవిడ ఆపసోపాలు పడుతోంది. కొంగు తీసి రొమ్ముల మీదుగా విసురు కుంటోంది తడవకోసారి.

'మొగోళ్లున్నారంట వొదినా. వోళ్లదైతే మనం," అంది ఆబిదా.

ఆవిడ అటూయిటూ చూస్తూ, ముందుకు వొంగి గుసగుసగా అంది.

"అసలు సరిపోద్దంటమే... వొండింది."

"నాకూ అనుమానంగా వుందొదినా. బిడ్డకైనా పెట్టిద్దామంటే యిస్తరాకెత్తుకొని దేక్షాకాడికి రమ్మన్నాడు అస్లామన్నా," అంది ఆబిదా.

"ఆ పని మాత్రం చేయబాక తల్లా. దేక్షాకాడ మొగోళ్లంతా కిందా మీదా పడుతున్నారు. యిందాకా జరీనా యెల్లి కొట్టుకాడున్న వాళ్లాయనకు టిపిను కట్టీమంటే గయ్‌మన్నారంతా. తటక్కన నిన్నా వో మాటంటే తట్టుకోలేవు," మేలు కోరుతున్నదానిలా అందావిడ.

ఆవిడ మాటలకు దేక్షాకాడికి వెళ్లాలన్న ఆలోచన మానుకుంది ఆబిదా. కొడుకొని వొళ్లో కూర్చోబెట్టుకొని వుసూరుమంటూ వెనక్కు వాలింది.

నిఖా లేటు గాకుంటే ఆడోళ్లకు యిన్ని బాదలు వొచ్చుండేవి కావు. అంతా పెళ్లికొడుకు వల్లే జరిగింది. అతడు పెడద్రం మనిషి. నెల్లూరు పూలదండలూ, ఉదయగిరి గుర్రం లేనిదే నిఖా చేసుకోనని ముందే ఎచ్చరిక చేశాడు. గుర్రం ఉదయగిరి నుంచి వొచ్చేసరికి పొద్దున పదైంది. నిఖా పదకొండున్నరకి, పన్నెండింటికి దావత్. పెళ్లికొడుక్కి గుర్రాన్ని చూశాక మనసాగలా. వాళ్ల పెద్దన్నని పిలిచి, "గుర్రం ఓనరుకి పైకర్చు నేనిస్తా. వూరంతా తిప్పమను," అని కోరిక చెప్పాడు.

నవరంగ్ బాజా. పెళ్లికొడుకు స్నేహితుల అలబరి చిందు. గుర్రం గజ్జెల దరువు. దాన్ని ఎగిరించడానికి గుర్రం ఓనరు హజరతయ్య డప్పు మోత. బూతు పాటలూ.

గంటనుకున్న వూరేగింపు రెండున్నర గంటలు పట్టింది. ఎండా, చెమటా. ఎన్ని సోడాలు తాగినా తీరని దప్పిక. తిరిగి నిఖా జరిగే పెళ్లికూతురి యింటికాడికి వొచ్చేటప్పటికి అందరి వొళ్లూ పులిసిపోయింది. మొఖాలు పీల్చుకుపోయాయి. పెళ్లికొడుక్కయితే నోట మాటలేదు. అంత అలుపు.

నిఖా ముగిస్తూ ఖాజీ దోసెడు కలకండ తీసి పెళ్లికొడుకు నెత్తి మీద నుంచి జనాల్లోకి విసిరేసేసరికి టైము రొండయ్యింది. కలకండ వైపు కన్నెత్తి కూడా చూడకుండానే బిలబిలమంటూ కూర్చున్న కుర్చీలనే టేబుళ్ల కాడికి సర్దుకున్నారంతా. జాగా దొరకనివాళ్లు షామియానా కిందకొచ్చి కిటకిటలాడుతూ నిలబడ్డారు.

"తొలిబంతిలో కూసోకపోతే ముక్కలు పోయినట్టే నయ్యో..." నవ్వుతూ నవ్వుతూనే నిరాశపడ్డాడో పెద్దాయన భుజం మీద తెల్లటి కండువా సరిచేసుకుంటూ. రొండో బంతిలో అయినా జాగా కొట్టాలని కొంతమంది బంతిలో కూర్చున్నవాళ్లెనకే నిలబడిపోయారు.

పెళ్లికొడుకు కావలిలో కంసాలి పని చేస్తాడు. మంచి పనిమంతుడు. కంసాలి వీధిలో అందరి తల్లో నాలికలా మెలుగుతాడు. అందువల్ల అతడికి స్నేహితుడు కానోడు లేడు. వాళ్లందరూ పెళ్లికి రావాలనే నిఖా ఆదివారం రోజు పెట్టించాడు. యెలాగూ సెలవే కాబట్టి కావలి నుంచి బిట్రగుంట పదిహేను కిలోమీటర్లే కాబట్టి వూహించినదానికంటే ఎక్కువమంది వచ్చేశారు. ఎప్పుడూ లేనిది కంసాలివీధి పెద్ద పనోళ్లు కూడా ఓపిక చేసుకొని కొత్త పంచెలు కట్టుకొని మరీ వచ్చారు. పెళ్లికూతురి తరుపోళ్లు ఏ కళన వున్నారో కాని తగువుపడి విడిపోయిన వాళ్లూ దూరాబారం అని వొంకలు పెట్టేవాళ్లూ పిల్లాజెల్లాతో దిగబడ్డారు.

వాళ్లందర్నీ చూసేసరికి పెళ్లికూతురి తండ్రి షరీఫ్‌కు పై ప్రాణాలు పైనే పోయాయి. పలావు వొండిందేమో మూడొందల మందికి. చూడబోతే నాలుగొందల మంది లెక్క తేల్తా వుండారు. యేం జేయాలో పాలుబోలేదాయనకు. దూరంగా వెళ్లి గంగరాయి చెట్టు కింద విచారంగా కూర్చున్నాడు.

దాంతో ఆ కష్టాన్ని గట్టెక్కించే బాధ్యత పెళ్లికూతురి మేనమామైన అస్లాం తీసుకున్నాడు. అస్లాంకు యిది సొంతకూతురి పెళ్లితో సమానం. అతడికి ఆడపిల్లల్లేరు. అందుకే అక్క కూతురిలోనే తన కూతురిని చూసుకున్నాడు. అక్కాబావల కంటే చిన్నప్పట్నించి తనే ఎక్కువ గారం చేసి పెంచాడా పిల్లని. యిప్పుడా పెళ్లిలో వాళ్లెవ్వరూ మాటపడటం యిష్టం లేదతనికి.

"బావా! నూ దిగులు పడబాకా. యిట్టాంటిదేదో జరుగుద్దనే పొద్దున పొట్టేళ్లు కోపించాక తలకాయలూ కాళ్లూ సపరేట్‌గా ముక్కలు కొట్టి పెట్టించా. యిప్పుడా కూర పొయ్యి మీదకెక్కింది. యింకో పొయ్యి మీద పదికేజీల బియ్యం వుడకతా వుంది. అన్నమయితూనే దాన్ని తీసి పలావ్‌లో మిక్సింగ్ కొట్టామంటే కలిసిపోద్ది. నీళ్ల డ్రమ్ముల్లో చెరి రెండు ఐసు గెడ్డలు యేయించా. ఆ నీళ్లు తాగితే ఆకలి సగం సచ్చిపోవాల్సిందే. మన మొగోళ్ల వరకూ ఫికిర్ లేదు బావా. వాళ్ల బంతికి ముక్కలయిపోయినా తలకాయ కూర పెట్టెయ్యొచ్చు," అని షరీఫ్‌కి భరోసా యిచ్చాడు అస్లాం.

"మన ఆడోళ్లని యేం జేస్తావురా," అని అడిగాడు షరీఫ్.

"నూ బలేవాడివే బావా! మొగోళ్లు మాదర్చోద్‌లు గాని వాళ్లదేముంది. స్టేషనుకాడ మసాలా వడలుంటాయి. అవి తెప్పిస్తా. తిని నీళ్లు తాగుతారు. సాయంత్రం అందరం ఏదో ఒకటి ఒండుకోవచ్చు," అని రంగంలో దిగాడు అస్లాం.

బంతి జరుగుతున్న చోటు- మస్తానయ్య వుర సప్పుడు కసుమూరు వీధుల్లా అరుపులు కేకలతో నిండిపోయి వుంది.

"పెరుగు పచ్చడి."

"గోంగూర."

"దాల్చా."

"ఖానా లావ్."

తింటూ తింటూనే కేకేసి పిలుస్తున్నారంతా. చెమటని చొక్కా భుజాలతో తుడుచుకుంటున్నారు.

అస్లాంకు ప్రతి బంతీ కత్తిమీద సాములా వుంది. అప్పటికీ తన మెకానిక్ షెడ్‌లో పనిచేసే మెరికల్లాంటి పిలకాలయని వడ్డింపుకు వుంచాడు. అయినా ఏ క్షణంలో ఏం మాటొస్తుందో అని భయంగా వుంది.

పెళ్లికొడుకైతే నిఖా అవడంతోటే సదివింపులు కూడా పట్టించుకోకుండా బంతి దగ్గరే నిలబడి పోయాడు. దగ్గరి బంధువుల కాడికీ, స్నేహితులకాడికీ పదేపదే వెళుతూ ఏం కావాలో విచారిస్తున్నాడు.

"మావా... కాస్త మంచి ముక్కలు యేరి మా వోళ్లకు యేస్తుండు," అంటున్నాడు అస్లాంతో తడవ కోసారి.

"మునీర్‌గాడి పెళ్లిలో మెతుకు కనబడలేదు రోయ్. అన్నీ ముక్కలే," అని రేపు కంసాలి వీధిలో స్నేహితులంతా గొప్పగా చెప్పుకోవాలని వుందతడికి.

డీసులు కరుగుతున్నాయి గాని ఒక్కరూ ఆకు మడవడంలేదు. చూసీ చూసీ అస్లాం తెగించాడు. యిక అణ్ణే వుండి మొహమాటానికి పోతే కడుపొచ్చేట్టుందని దేక్షాకాడికి వెళ్లి పిలకాయలకి చెప్పాడు.

"రేయ్. నేనుంటే ఆడ పని జరిగేట్టులేదు. అంతా మీరే జూసుకోండి. పెళ్లికొడుకు మాట యినబాకండి. ఆకుల్లో తొలిసారి అన్నం పెట్టినప్పుడు నాలుగు ముక్కలెయ్యండి. ఆ తర్వాత ఎవురడిగినా ఎన్నిసార్లడిగినా వుత్త అన్నమే వెయ్యండి. అడిగితే తెస్తున్నామని చెప్పండి. మా బావ ముప్పయి వేలతో పలావొండింది వోళ్ల యెదాన కొట్టడానికి కాదు. మన పిలకాయలు కూడా తినడానికి," అని, పెరటవుతలికెళ్లి దూరంగా నిలబడ్డాడు.

ఆ యింటవుతల రైలు పట్టాలు. వాటిని దాటితే విశాలమైన మైదానం.

సిగరెట్ తీసి చుట్టుపక్కల షరీఫ్‌ని గమనించుకొని దాన్ని వెలిగించాడు. బావే అయినా షరీఫ్ ముందు అతడు సిగరెట్ తాగడు. రెండు మూడు దమ్ముల తర్వాత అతడి మనసు కొంచెం స్థిమితపడింది. యీ పెళ్లి, యీ అడావిడి, యీ బంధువులను చూస్తుంటే అతడికి తన పెళ్లి గుర్తొచ్చింది.

అప్పట్లో యింత కర్చు లేదు. యింత దుబారా లేదు. వస్తువులు యింత విరివిగా లేవు.

అయినా అతడికి పిల్లనిచ్చిన మావ పెళ్లి పూర్తయ్యేటప్పటికి నలిగి వొత్తయిపోయాడు. అస్లాం చేసుకున్న పిల్ల దగ్గరి బంధువు. వాళ్ల నాన్నది పూలకొట్టు. పెళ్లీడుకొచ్చిన నలుగురు పిల్లలతో సతమతమయ్యేవాడు. అందుకే అస్లాం పెద్దగా ఏమీ అడగలేదు. వాళ్లే తంటాలుపడి ఎనిమిది వందల కట్నం, వాచీ వుంగరం యిచ్చారు. ఆ ఎనిమిది వందల్లోనే పెళ్లికి కావలసిన సరంజామా, తన బట్టలూ అక్కాబావా బట్టలూ, పెళ్లి కూతురికి బంగారు పుస్తె కొన్నాడు.

కాపురానికి యివ్వాల్సిన జహేజ్ (అన్నం తినే కంచం నుంచి ముడ్డి కడుక్కునే చెంబు వరకూ) పెద్ద మనసుతో వొద్దన్నాడు. పెళ్లికి ఎక్కువమంది బంధువులను పిలవొద్దన్నాడు. దానికే సంబరంతో పొంగిపోయిన ఆ ముసలాయన జహేజ్ డబ్బుతోటి వచ్చిన యాభై అరవై మందికి ఘనంగా పలావు వొండి పెట్టాడు.

కానీ, ఆ పెళ్లికీ యీ పెళ్లికీ ఎంత తేడా!

ఆ రోజుల్లో వూరు మొత్తానికి తనొక్కడే మెకానిక్. ఏ ఒన్ పనోడు. అయినా కట్నం ఎంతిస్తే అంత తీసుకున్నాడు. యిప్పుడు వూరంతా మెకానిక్కులే. అందరూ సాయిబుల పిల్లలే. పని వుండీ లేనోళ్లే. అయినా పెళ్లంటే లక్షాడ పెట్టమంటున్నారు. వీళ్లే కాదు టైలర్లూ, కార్పెంటర్లూ, వెల్డర్లూ, కసాబులూ... ఒకళ్లని ఏముంది అందరిదీ ఒకే రేటు. అప్పటికీ యిప్పటికీ సాయెబుల బతుకు మారలేదుగాని కట్నాలు పెరిగిపోయాయి.

తన పెళ్లిలాగే ముక్తసరిగా యీ పెళ్లి కూడా జరిపిద్దామంటే మరేదకు పోయి షరీఫ్ ఎన్ని తిప్పలుపడ్డాడో తనకు తెలుసు. అరవైవేలు కట్నం. నలభై వేలు జహేజ్. యిరవై వేలు బట్టలు. ముప్పైవేలు పలావు.

పైన చిల్లర మల్లర కర్చు.

యిల్లమ్మినా కోలుకోలేనంత అప్పు.

ఆలోచించే కొద్దీ మనసు చేదెక్కింది అస్లాంకు.

సిగరెట్ సగంలోనే పారేయబోతుంటే రియాజ్ వొచ్చాడు.

"అస్లామనా.. నిన్ను ఆబిదక్క పిలుస్తోంది," అని. వాడూ ఆబిదాలాగే యింకో మేనత్త బిడ్డ అస్లాంకు.

అస్లాంవాళ్ల నాన్నకు మొత్తం ముగ్గురు చెల్లెళ్లు. ముగ్గురు తమ్ముళ్లు. అందరికీ ఆడపిల్లలూ మొగ పిల్లలూ వున్నారు. అయినా వొకరింట్లో మరొకరు సంబంధం చేసుకోరు. అసలు ఆ మాటే ఎత్తరు.

అప్పటికీ రియాజ్‌ను వొకరోజు కదలేశాడు అస్లాం.

"ఎంతో కొంత తీసుకొని మీ మేనత్త కూతుర్లలో ఒకదాన్ని చేసుకోరా రియాజా. అయినోళ్ల బారం తీర్చినోడవుతావు," అని.

వాడు వెంటనే నవ్వేశాడు.

"పో అనా. అయినోళ్లలో చేసుకుంటే అసలకి కట్నం యివ్వరు. అట్లాగని చదువుకున్న పిల్లయినా కాక పోయే. యింటికాడ ట్యూషన్లు చెప్పి సంపాదిస్తుం దనుకుంటే," అనేశాడు.

అస్లాంకి కోపం వచ్చింది.

"నువ్వేం చదివినావురా. కరెంటు పని కదా చేస్తున్నావు," అన్నాడు.

దానికి వాడు సమాధానం చెప్పకుండా గుర్రుగా చూసి వెళ్లిపోయాడు.

"మీలాంటి మాదర్చోద్‌లు వుండబట్టే కదరా యిళ్లకాడ పెళ్లికావలసిన ఆడపిల్లలు మందలు మందలుగా పడి ఏడుస్తుండారు," అని క్యాకరించి వుమ్మేశాడు అస్లాం.

యిప్పుడు రియాజ్‌ని చూడ్డంతోటే పెళ్లికొడుకుని చూసినంత కోపం వచ్చింది.

"బంతి కాడుండమంటే యీడకొచ్చినావేమిరా బాడ్‌కవ్," అని కసిరి వాడి జవాబు కోసం చూడకుండా యింట్లోకి వెళ్లాడు.

గడప దగ్గరే ఆబిదా ఎదురైంది. చంకలో కొడుకు నెక్కించుకొని చిన్న గిన్నెలో అన్నం కలుపుతూ వాడికి తినిపిస్తోంది. అస్లాం అది చూసి, 'యేడదిమే,' అని అడగలేదు.

'యేంది మే' అన్నాడు.

"పెళ్లికూతురి స్నేయితురాళ్లు వొచ్చారనా. హిందువులు. స్కూల్లో కలిసి చదువుకున్నారట. వోళ్లు పలావు తినరు. వుడిపి హోటలు నుంచి పార్శిలు తెప్పీమని చెప్పారు," అంది ఆబిదా.

అస్లాంకు అర్థం కాలేదు.

"పెళ్లికూతురికి స్నేయితురాళ్లేందిమే," అన్నాడు ఆశ్చర్యంగా.

"అదేందనా. పెళ్లికూతురికి స్నేయితురాళ్లు వుండకూడదా?"

"అయన్నీ మాటలొద్దు. పలావు తినని స్నేయి తుల కోసం పెళ్లికొడుకు పదిహేను భోజనాలు తెప్పీ మన్నాడు. తెప్పించా. యిప్పుడీళ్లక్కూడా యాణ్ణించి తెచ్చేది. తెల్లన్నం వుడుకుతోందిగా. దించగానే గోంగూ రేసి పెట్టించెయ్," అని బంతి దగ్గరకు వెళ్లాడు.

అప్పుడే మొగపెళ్లోళ్లందరూ ఆడోళ్లతో సహా తినేశారు. యిప్పుడు ఆడపెళ్లోళ్ల వొంతు. ముందు మొగోళ్లు కూర్చున్నారు.

అస్లాం గబగబా దేక్షా కాడికెళ్లి ఒకసారి మూత తెరిచి చూసి వూపిరి పీల్చుకున్నాడు.

తడిచీర మీద తెల్లన్నం ఆరబోసి దాన్ని దేక్షాలో కలపడానికి గరిటె తీసుకున్న బావర్చీ (వంటవాడు) అస్లాం కంగారు చూసి నవ్వుతూ అన్నాడు.

"సరిపోద్దిలే అస్లాం భాయ్. నువ్వు పోయి బంతి కాడ నిలబడు."

అస్లాం బంతికాడికి పోబోతుంటే మళ్లీ యింట్లోంచి పిలుపొచ్చింది. యీసారి పిలిచింది పెళ్లి కూతురి తల్లి.

"అస్లామా.. జహేజ్‌లో యే వొస్తువా లేకపోయినా వొప్పుకోదంట్రా పెళ్లికొడుకు తల్లి. బెడ్‌లైటుతో సహా వుండాలంట. బెడ్‌లైటు మనం కొనలేదుగదరా," అంది గాబరాగా.

అస్లాంకి సర్రన ఎక్కింది. "యేవంటా... ఆ చేసు కునే నా కొడుకు కొనుక్కోలేడంట్నా బెడ్‌లైటు. కట్నం యిచ్చి, బంగారం లాంటి పిల్లనిచ్చి, మంచం యిచ్చి, పరుపిచ్చి యింకా బెడ్‌లైటు కూడా యియ్యాలంట్నా. అకా. నా నోటికి మంచి మాటలు రావు. మనం బెడ్ లైటు యిచ్చేది లేదు. ఏం జేస్కుంటారో చేసుకోమను," అని బయటికొచ్చాడు.

అన్నం అయిపోవచ్చింది.

లాస్టు బంతి. ఆడ పెళ్లోళ్లలో చిట్టచివరి మొగోణ్ణి కూడా వెతికి అందులో కూర్చోబెట్టారు. యిక తిననిది షరీపూ అస్లామే. ఆ ముందు బంతిలోనే తలకాయకూర కూడా అయిపోయింది. యిక మిగిలింది అడుగూ బొడుగేనని ఆ బంతిలోని మొగోళ్లకూ, తమకు అది కూడా లేదని అడోళ్లకూ తెలిసిపోయింది. మొగోళ్లు చిర్రు బుర్రుమంటున్నా ఆడోళ్లు కిక్కురుమనడం లేదు.

యింతలో పెళ్లింట్లో కలకలం రేగింది. ఎవరో పెద్దగా యేడుస్తున్నారు. దబాదబా చప్పుడవుతోంది. యింట్లోంచి పరిగెత్తుకుంటూ అస్లాంకాడికి వచ్చాడు షరీపు.

అస్లాం బిత్తరపోయాడు.

"అస్లామా... ఆబిదా మొగుడు బంతిలో కూర్చు న్నప్పుడు నువ్వాడలేవట్రా," అన్నాడు షరీఫ్.

"లేను బావా... యేం," అన్నాడు ఆదుర్దాగా.

"కొంప ముంచినావు కదరా. వాడో నస్లిహరామ్ నా కొడుకు. యిస్తట్లో ముక్కలు పడలేదని పెళ్లాన్ని చావబాత్తున్నాడు," అన్నాడు షరీఫ్.

అస్లాం యింట్లోకి పరిగెత్తాడు.

ఆబిదా జుట్టు రేగిపోయి వుంది. కుచ్చిళ్లు జారి పోయాయి. చేత్తో కాలితో తంతున్నాడు ఆబిదా మొగుడు.

"మరేద తెలీని యింటికి రావొద్దన్నానా. తిండికి మొహం వాచి యీడకొచ్చినా నేను. ఒకరికో మరేదా? యింకోరికో మరెదా? ఎవరెవరికో పలావు ముక్కలునూ నాకేమో తలకాయ బొమికలా? పా లంజా... యింటికి పా. నీ సంగతి తేలుస్తా," అని ఆబిదా జుట్టు పట్టుకొని లాగాడు.

అతడి కోపం చూసి అస్లాంకు మాట పెగల్లేదు. ఎందరు వారించినా అతడు వినడంలేదు. ఆబిదా ఏడుస్తూనే సూటుకేసు తీసుకొని చంకన బిడ్డనెత్తుకొని అతడి వెనుక నడిచింది. ఆబిదా అన్నలకూ, చెల్లెళ్లకూ రక్తం వుడికిపోయింది. యింటల్లుడికి అవమానం జరిగి నందుకు షరీఫ్ మీద యుద్ధానికి దిగినారు. షరీఫ్‌కు మద్దతుగా యింకొంతమంది ముందుకు దూకారు. క్షణాల్లో మాటామాటా పెరిగి అరుపులూ కేకలూ హోరె త్తాయి. పిలకాయలు భయంతో ఏడుపందుకున్నారు.

అస్లాంకు అసహ్యం వేసింది.

తమాషా చూస్తున్నట్టు నిలబడ్డ మొగపెళ్లోళ్ల ముందు అవమానం జరిగినందుకు మొహం ఎర్రగా కందిపోయింది.

యింత చాకిరీ చేసి, యిన్ని కష్టాలు పడి చేసిన దంతా చివరి క్షణంలో నవ్వుల పాలైనందుకు కళ్లలోంచి బొటబొటమని నీళ్లు రాలిపడ్డాయి.

పెళ్లికూతురు అత్తింట అడుగుపెట్టిన కాణ్ణుంచి యీ గలాటా ఆ పిల్లను యేపక తినడానికి పెద్ద సాకవుద్దని తెలిసి అతడు తమాయించుకోలేకపోయాడు.

ఆవేశంతో యెద ఎగిరిపడుతుంటే బొంగరు పోయిన గొంతుతో అరిచాడతడు.

'రేయ్! అల్లా నాకు ఆడపిల్లల్ని యివ్వలేదు. యిచ్చుంటే వాళ్లను నరికేయనన్నా నరికేస్తానుగాని యిట్టాంటి పెళ్లిళ్లు మాత్రం చెయ్యన్రా. యిట్టాండి ఢవ్వా నా కొడుకుల చేతల్లో పెట్టి వాళ్ల గొంతు కొయ్యన్రా. ఒక ఆడది ఒక మొగోడు కలిసి కాపురం వుండాలంటే యింత తగాదా ఎందుకురా... యిన్ని బాదలు ఎందుకురా. యింత కర్చెందుకురా. యిన్ని వందల మంది ఎందుకురా... నా కొడకల్లారా..."

అతడి మాటలు ఎవ్వరికీ వినిపించడంలేదు. లోపల మొగోళ్లు మొగోళ్లు తిట్టుకుంటూ అడ్డం వచ్చిన వాళ్ల పెళ్లాల్ని పడేసి తంతున్నారు...

ఆరోజు ఆడపెళ్లోళ్లలో యేడ్వని ఆడది లేదు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 16 నవంబర్ 1997*

